సాక్షి
కుమురంభీం

గురువారం ၊ 7 ၊ మార్చి ၊ 2024



సరిహద్దున 'మహాశివరాత్రి'

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని ఆలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. ఈ ఆలయాలకు స్థానికులు భారీగా తరలి వెళ్లనున్నారు. 8లో▸



వాహ్.. ఖర్జెల్లి

చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లి అడవులు కొత్త అందాలను సంతరించుకున్నాయి. మారిన వాతావరణంతో ఆకులు రాలి మోదుగు పూలు కనువిందు చేస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.9 /21.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరిగి వేడి అధికమవుతుంది. జిల్లా వ్యాప్తంగా చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,419 మందికి 4,191 మంది హాజరు కాగా 228 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శంకర్ తెలిపారు. జనరల్ విభాగంలో 3,521 మందికి 3,384 మంది హాజరు కాగా, 147 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 888 మందికి 807 హాజరు కాగా, 81 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు. రెబ్బెన, తిర్యాణిలోని పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

వారంలోగా పనులు పూర్తి చేయాలి



గ్రంథాలయ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా గ్రంథాలయ నిర్మాణ పనులు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ భవనాన్ని బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్మిస్తున్న భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. భవనానికి సంబంధించిన నిధులను ఇతర పనులకు వినియోగించొద్దని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరయ్యే పత్రికలు, పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్నారు.

వాహనాల వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన ఏడు వాహనాలకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారి జ్యోతికిరణ్ సమక్షంలో ఇన్‌స్పెక్టర్ డి.దీపక్ బుధవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 45 మంది పాల్గొనగా.. ప్రభుత్వానికి రూ.1,37,000 ఆదాయం సమకూరింది. అలాగే జీఎస్టీ రూపంలో మరో రూ.31,760 ఆదాయం వచ్చిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన వాహనాన్ని ఈ నెల 15న వేలం వేస్తామని పేర్కొన్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర గిరిజన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గోండు, నాయక్‌పోడ్, పర్ధాన్‌లకు 3 సీట్లు, కొలాంలకు 1, లంబాడాలు 1, ఇతర గిరిజనులకు 1 సీటు చొప్పున ఆరు సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బాలురులకు 3, బాలికలకు 3 సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. 2017 జనవరి 1 నుంచి 2018 మే 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 14న లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

రైతులకు మరింత చేరువగా సాంకేతికత



వీసీలో పాల్గొన్న డీఏవో శ్రీనివాసరావు, అధికారులు, రైతులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని రైతులకు సాంకేతికత మరింత చేరువ చేస్తామని డీఏవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్(టి), జైనూర్ మండలం కొలాంగొరి రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. డీఏవోతోపాటు పలువురు వ్యవసాయశాఖ అధికారులు, రైతులు జిల్లా కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వారానికి రెండు రోజులు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.

రాజకీయం తారుమారు!

- మారుతున్న 'సిర్పూర్' సమీకరణాలు
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నియోజకవర్గ నేతలు
- బీఎస్పీ, బీఆర్‌ఎస్ పొత్తుతో క్యాడర్‌లో అయోమయం



సీఎం రేవంత్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

సాక్షి, ఆసిఫాబాద్: వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనుండడంతో సిర్పూర్ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాయి. రాష్ట్రంలో అతిత్వరలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉన్నందున ప్రధాన పార్టీలు చేరికలను వేగవంతం చేశాయి. ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు పొడవడం.. ఆ పార్టీ అధినేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోనే తాను ఓటమి పాలయ్యానని తీవ్ర మనస్తాపంతో ఉన్న కోనేరు కోనప్ప అకస్మాత్తుగా కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే ఆయన బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతో బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్ అయోమయంలో పడింది. అదే సమయంలో నిన్నటివరకు 'నువ్వా– నేనా' అనే రీతిన తలపడిన బీఎస్పీ క్యాడర్ సైతం రాజకీయ సమీకరణలు మారడంతో సందిగ్ధంలో పడినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ మాత్రం 'ఆదిలాబాద్'పై గురి పెట్టినట్లు సమాచారం. అందువల్లే ఉమ్మడి ఆదిలాబాద్‌లో వీలైనంత మంది బీఆర్‌ఎస్, బీజేపీ నేతలను పార్టీలో చేర్చుకునేందుకు యత్నిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హ్యాట్రిక్ ప్రయత్నంలో ఓటమి పాలు..

కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించిన కోనేరు కోనప్ప 2004లో ఆ పార్టీ తరఫున ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి పాల్వాయి రాజ్యలక్ష్మిపై విజయం సాధించారు. తర్వాత 2009లో తెలంగాణ వాదంతో బరిలో దిగిన టీఆర్‌ఎస్(ప్రస్తుత బీఆర్‌ఎస్) పార్టీ అభ్యర్థి కావేటి సమ్మయ్య.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్పపై గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌ను నిరాకరించడంతో ఆ వెంటనే కోనప్ప బీఎస్పీ నుంచి పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై ఘన విజయం సాధించారు. అనంతరం కోనప్ప టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. 2018లోనూ కోనప్ప టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగానే విజయం సాధించారు. ముచ్చటగా మూడోసారి(హ్యాట్రిక్) గెలుపొందాలని ఆశించిన కోనప్పకు 2023 ఎన్నికల్లో నిరాశ ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ వీడుతారనే ప్రచారం జోరుగా సాగింది. ఆ ప్రచారాన్ని నిజం చేస్తూ కోనప్ప కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు.

బలం పెంచుకునే పనిలో కాంగ్రెస్

గతేడాది చివరిలో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడం, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నేపథ్యంలో కోనేరు కోనప్ప ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు చోట్ల బీజేపీ, రెండు చోట్ల కాంగ్రెస్, ఒక స్థానంలో బీఆర్‌ఎస్ విజయం సాధించాయి. అధికార బలంతో ఎలాగైనా ఆదిలాబాద్ పార్లమెంట్‌లో పాగా వేయాలని భావిస్తోన్న కాంగ్రెస్ ఇక్కడి అసెంబ్లీ స్థానాల్లో తన బలాన్ని పెంచుకునే ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా బలమైన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు వల విసురుతోంది. ఈ నేపథ్యంలోనే కోనప్పను పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కోనప్ప 3,088 స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. బలమైన క్యాడర్ అండ ఉన్న కోనప్ప కాంగ్రెస్‌లోకి వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కలిసోస్తుందని ఆ పార్టీ అధిష్టానం నమ్ముతోంది. అదే సమయంలో నిర్మల్, ఆదిలాబాద్ నియోజకవర్గాల నుంచి కూడా బీఆర్‌ఎస్ నేతలు పార్టీ మారితే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అడ్డుకోవడం అసాధ్యమని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

సీఎంను కలిసిన కోనప్ప

కౌటాల(సిర్పూర్): హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరుడు, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి సీఎంను శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని తన కార్యకర్తలతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

దిక్కుతోచని స్థితిలో క్యాడర్

కోనేరు కోనప్పను నమ్ముకుని ఇన్నాళ్లు ఆయన వెంటే నడిచిన బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్ ఇప్పుడు అయోమయంలో పడింది. కోనప్ప కాంగ్రెస్ పార్టీ గూటికి చేరనుండటం.. ఆ పార్టీకి వ్యతిరేకంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాటం చేసిన పార్టీ నాయకులు, శ్రేణులు ఇప్పుడు ఏ వైపు నిలువాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. నిన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన రావి శ్రీనివాస్, ఇటీవల బీఎస్పీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన హర్షద్ హుస్సేన్‌లు కోనప్ప రాకను స్వాగతిస్తారా.. లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే అనేక మంది బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు కాంగ్రెస్ గూటికి చేరిన సంగతి తెలిసిందే. కాగా, కోనప్ప కాంగ్రెస్‌లో చేరితే ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తారా? అప్పగిస్తే? ఆయన వెంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ క్యాడర్ నడుస్తుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇక బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ధీటుగా పోరాడిన బీఎస్పీ క్యాడర్ సైతం ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉంది. బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు కుదరడంతో నిన్నమొన్నటి వరకు గ్రామాల్లో ప్రత్యర్థులుగా ఉన్న ఇరు పార్టీల కార్యకర్తలు ఉన్నట్టుండి పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేయడం ఎలా? అన్న సందిగ్ధంలో పడినట్లు తెలుస్తోంది.

'గులాబీ' గూటికి పగుళ్లు!

- బీఎస్పీ, బీఆర్‌ఎస్ పొత్తుతో కాంగ్రెస్‌లోకి కోనప్ప
- ఇప్పటికే 'హస్తం' పార్టీలోకి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత
- మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల పార్టీ మార్పుపై చర్చలు
- బీఆర్‌ఎస్ నేతలే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పావులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్‌తో బీఎస్పీ పొత్తు ఖరారు కావడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతోపాటు అనుచర వర్గం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఈ నియోజకవర్గంలో మరింత దెబ్బ తగలనుంది. తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో మరికొందరు నాయకులు కండువాలు మార్చుతారనే ప్రచారం జోరందుకుంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పావులు కదుపుతుండడంతో ఎవరు ఎటువైపు వెళ్తున్నారనేది ఆసక్తికరంగా మారింది. అటు ఆదిలాబాద్ ఇటు పెద్దపల్లి పార్లమెంటు స్థానాల్లో నాయకుల తీరు రాజకీయ మార్పులకు దారి తీస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యేల పక్క చూపులు

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో నేతల్లో నైరాశ్యం నెలకొంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారేందుకు అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లడమా..? బీజేపీలో చేరడమా..? అనే దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రస్తుతం 'గులాబీ' పార్టీకి గడ్డుకాలమే ఉండడంతో కార్యకర్తలు, నాయకుల నుంచి ఒత్తిడి కారణంగా మార్పు తథ్యంగా భావిస్తున్నారు. ఇందుకు లోక్‌సభ ఎన్నికలు మంచి తరుణంగా భావిస్తూ ఎవరికి ఏ పార్టీతో మేలు ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రాధాన్యత ఇస్తేనే చేరుతామనే మెలిక పెట్టినట్లుగా చెబుతున్నారు. అయితే ఎవరికీ స్పష్టమైన హామీ రానట్లు తెలిసింది. వీరితోపాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానాలు అందడంతో పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోవడంపై ఆలోచిస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్సీతోపాటు సీనియర్ నాయకులు సైతం పార్టీ మార్పుపై గత కొంతకాలంగా సమాలోచనలు చేస్తున్నారు.

బయటపడనున్న అసంతృప్తులు

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాల గెలుపు కోసం కాంగ్రెస్, బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఇందుకు దీటైన అభ్యర్థుల కోసం అనేక రకాలుగా వడపోతలు చేస్తున్నాయి. ఆదిలాబాద్ సిట్టింగ్ సీటును ఎంపీ సోయం బాపురావుకే కట్టబెడతారా..? లేదా..? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, డాక్టర్ సుమలత, జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, తదితరులు పోటీలో ఉన్నారు. ఆదివాసీ, లంబాడా వర్గాల ప్రభావం, ప్రత్యర్థి పార్టీల్లో అభ్యర్థుల ఖరారు కాకపోవడంతో వేచి చూస్తున్నారు. మళ్లీ 'సోయం'కు అవకాశం రాకపోతే ఆయన నిర్ణయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గొడం నగేశ్ ఉన్నారు. నగేశ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు దక్కలేదు. దీంతో ఆయన నిర్ణయం ఎటువైపు ఉంటుందోనని ఆసక్తిగా మారింది. ఇక పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించగా, ఆయన ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ఆశించి పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానంగా పోటీలో ఉండగా, పెర్క శ్యామ్ మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. 'గడ్డం' కుటుంబానికే మళ్లీ టికెట్ ఇస్తే పార్టీకి ఇబ్బంది అవుతుందని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వంశీకి టికెట్ ఇస్తే నాయకుల్లో అసంతృప్తి రాజుకోనుంది. ఇక బీజేపీలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ టికెట్ ఆశిస్తుండగా, ఎస్.కుమార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ వంటి నేతలు పోటీలో ఉన్నారు.

మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంస్కారం కలిగిన భావితరాలను అందించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళలు సహజంగా ఉండే ఓర్పు, సహనంతో కుటుంబాలను తీర్చదిద్దుతారన్నారు. సమాజ సేవలోనూ ముందుండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మహిళలతో సృష్టి మనుగడ సాధ్యమవుతుందని, వారిపై వివక్షత లేకుండా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, వారికి సముచిత స్థానం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు క్రీడలు, ఉద్యోగాలు లాంటి ప్రతీ రంగంలో ముందుండాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొని దేశానికి పేరు తీసుకురావాలన్నారు. మహిళలు చదువు, ఉద్యోగం, రాజకీయం, సామాజిక రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని సన్మానించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.

'పది' ఫలితాల్లో ముందంజలో ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లా ముందంజలో ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్‌తో కలిసి హెచ్‌ఎంలు, హాస్టల్ వార్డెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో మొత్తం 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, 6,595 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. సెంటర్లలో ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. డీటీడీవో రమాదేవి, డీఎంహెచ్‌వో తుకారాం, డీపీవో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో బుధవారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా బొమ్మల కొలువులో వెదురు బొంగులతో ఏర్పాటు చేసిన మంచె, గుడిసెలు ఆకట్టుకున్నాయి. అయోధ్య రామమందిరం, గంగాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాలను ప్రదర్శించారు. అనంతరం లేడీస్ క్లబ్ సభ్యులు ర్యాంపు వాక్ చేసి ఉత్సాహం నింపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, సేవా సమితి ఉపాధ్యక్షురాలు నళిని, లేడీస్ క్లబ్ కార్యదర్శి మంజుల, సభ్యులు అరుణ, లీల, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను పరిశీలిస్తున్న జీఎం రవిప్రసాద్

అరకొర వేతనాలతో అవస్థలు

- ఆర్థిక కష్టాలతో కారోబార్‌లు సతమతం
- ప్రత్యేక రాష్ట్రంలోనూ పెరగని జీతాలు
- జిల్లాలో 335 జీపీలకు 120 మంది విధులు

ఆసిఫాబాద్‌అర్బన్: పంచాయతీల్లో కీలకపాత్ర పోషించే కారోబార్‌లు ఆర్థిక కష్టాలతో సతమతం అవుతున్నారు. క్షేత్రస్థాయిలో కీలక విధులు నిర్వర్తించే వీరికి ఏళ్లుగా అరకొరగానే జీతాలు అందుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రంలో వేతనాల పెంపు లేకపోగా.. మల్టీపర్పస్ విధానంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


2019లో మల్టీపర్పస్ విధానం..

గ్రామ పంచాయతీల అభివృద్ధి, వివిధ అవసరాల కోసం 2019లో అప్పటి ప్రభుత్వం జీవో 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. జీపీల్లో పాత సిబ్బందిని కొనసాగిస్తూనే 500 జనాభాకు ఒకరు సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టింది. అప్పటి నుంచి సిబ్బంది తక్కువగా ఉన్న పంచాయతీల్లో వీరిపై పని భారం అధికంగా ఉంటోంది. అయితే ప్రస్తుతం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. కేవలం 120 మంది కారోబార్‌లు మాత్రమే పని చేస్తున్నారు. 40 ఏళ్లకు పైగా పని చేస్తున్నా తమకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్టీపర్పస్ విధానం కోసం జారీ చేసిన జీవో 51ను వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. జీవో 60 ప్రకారం మున్సిపల్ సిబ్బంది రూ.19,500, కిందిస్థాయి సిబ్బంది రూ.16,600 చెల్లించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ సర్కారు కారోబార్ల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రధాన డిమాండ్లు..

- జీవో నం.51 ప్రకారం అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.
- మున్సిపల్ కార్మికుల మాదిరిగానే పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి.
- జీవో నం.212, 112ను సవరించాలని, ఈ జీవోలు వర్తించే వారందరినీ పర్మినెంట్ చేయాలి.
- కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్ వంటి ఉద్యోగాల్లో పంచాయతీ కార్మికులకు అవకాశం కల్పించాలి.
- ఉద్యోగాలు క్రమబద్ధీకరించడంతోపాటు కారోబార్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి.
- ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేస్తూ రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.

అధిక పనిభారం



గ్రామ పంచాయతీల్లో కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదు. తక్కువ వేతనాలు ఇస్తూ అధిక పని భారం మోపుతోంది. కారోబార్‌లపై పనిభారం అధికంగా ఉంటోంది. వారి న్యాయపరమైన డిమాండ్లను గుర్తించి నెరవేర్చాలి. – వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం

సృష్టిలో గొప్ప శక్తి మహిళ మాత్రమే



పోటీలు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: సృష్టిలో గొప్ప శక్తి మహిళ మాత్రమేనని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పోటీ పడుతూ ఉద్యోగావకాశాలు దక్కించుకోవడం, విధులు నిర్వర్తించడం గొప్ప విషయమన్నారు. మహిళలకు చెస్, క్యారమ్, థగ్ ఆఫ్ వార్, పాటల పోటీలు, నృత్యాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని సన్మానించారు. డీఎస్పీ సదయ్య, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్‌ఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి



దీక్ష శిబిరంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు లేఅవుట్ రెగ్యులరైజేషన్(ఎల్‌ఆర్‌ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. అధిష్టానం పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న 25.44లక్షల మందిపై రూ.లక్ష చొప్పున దాదాపు రూ.20 వేల కోట్ల ఆర్థికభారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు అధికారంలోకి రాగానే ప్రజలను పీడిస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోసం అడ్డగోలుగా 420 హామీలు, 6 గ్యారంటీలు ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు బీఆర్‌ఎస్ పథకాలు, కార్యక్రమాలనే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండా ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మేకల మందపై తోడేళ్ల దాడి



గాయపడిన మేక పిల్లతో కాపరి చందు

వేమనపల్లి: పట్టపగలే పంట చేలల్లో మేకలు మేత మేస్తుండగా తోడేళ్లు దాడికి పాల్పడ్డాయి. వేమనపల్లికి చెందిన కోట మల్లక్కకు చెందిన మేకల మందతో ఆమె అల్లుడు చందు పంట చేలవైపు మేత కోసం వెళ్లాడు. నాలుగు తోడేళ్లు మందపై చేయగా రెండు మేకపిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. కాపరులు అప్రమత్తమై అరవడంతో తోడేళ్లు పారిపోయాయి.

బెల్లంపల్లిలో రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం, నిందితుడితో పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అంబేద్కర్‌నగర్ బస్తీలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉంచారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుపతి, శ్రీను, శ్రీధర్ తనిఖీ చేశారు. 12క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా, బస్తీకి చెందిన అవని గంటి సాంబమూర్తి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం వద్ద సిబ్బంది

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి సత్యసాయినగర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కిషన్ అక్రమంగా సమీపంలోని షెడ్డులో సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేశాడు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం రాత్రి దాడి చేసి బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్రసాద్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

జన్నారంలో బియ్యం పట్టివేత

జన్నారం: మండల కేంద్రంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆటోలో మూడు క్వింటాళ్ల బియ్యం ఉండడంతో సీజ్ చేశారు. ఆటోలోని జరుపుల కాంతయ్యను విచారించగా, రూ.16కు కిలో చొప్పున కొనుగోలు చేసి జన్నారంలోని ఓ వ్యక్తికి రూ.18 చొప్పున విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. బియ్యం, ఆటో సీజ్ చేసి విచారణ చేస్తున్నారు.



మార్కండ దేవాలయం



సరిహద్దున ‘మహాశివరాత్రి’

మార్కండ మహాదేవ ఆలయం

మహారాష్ట్రలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో మార్కండ మహాదేవ ఆలయం ఒకటి. భక్త మార్కండేయుడు కొలిచిన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. గడ్చిరోలి జిల్లాలోని చాముర్షి తాలూకాలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న వైన్‌గంగ నది తీరంలో ఈ ఆలయం ఉంది. అద్భుతమైన ప్రాచీన కట్టడమైన ఇక్కడ జరిగే మహాశివరాత్రికి లక్షల్లో భక్తులు తరలివస్తారు. పురాణాల ప్రకారం.. హర్యానా ప్రాంతానికి చెందిన మార్కండేయ అనే రుషి శివుడి అనుగ్రహం కోసం ప్రత్యక్షం కావడానికి ఘోర తపస్సు చేస్తాడు. అతడి తపస్సును అడ్డుకునే ప్రయత్నం చేయడంతో రుషి శిరస్సును ఖండించి శివుడికి సమర్పించే ప్రయత్నం చేస్తాడు. దీంతో అతడిని శివుడు అనుగ్రహిస్తాడు. ఈ ప్రాంతం రుషి పేరుమీదుగా ప్రసిద్ధి చెందుతుందని వరమిస్తాడు. ఆలయాన్ని 8వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం మధ్య రాష్ట్రకూటుల పాలనలో అభివృద్ధి చేసినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. దాదాపు 15 రోజులపాటు శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. తాత్కాలికంగా సినిమా థియేటర్లు, సర్కస్, మ్యాజిక్‌షోలు ఏర్పాటు చేస్తున్నారు. కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) నుంచి 80 కిలోమీటర్ల దూరం, కాగజ్‌నగర్ నుంచి 105 కిలోమీటర్ల దూరంలో ఈ పురాతన ఆలయం ఉంది. సమీపంలోని చాముర్షి, మూల్ పట్టణాల నుంచి బస్సు సౌకర్యం ఉంది. అలాగే చంద్రపూర్, మూల్ పట్టణాల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి.

- ఉమ్మడి జిల్లాకు సమీపంలో ప్రసిద్ధ ఆలయాలు
- ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రసిద్ధ శైవక్షేత్రంగా మార్కండ మహాదేవ ఆలయం
- ఆకట్టుకునే చపరాడ ఆలయం.. ప్రకృతి ఒడిలో 'సోమ్‌నాథ్'
- చెట్టు కాండంలో విగ్రహాల జాతర.. తోగుల వెంకటాపూర్

చింతలమానెపల్లి(సిర్పూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. ఏడాది పొడవునా ఆధ్యాత్మిక చింతనలో గడిపే ఇక్కడి గిరిజనులు, గిరిజనేతరులు పలు ఉత్సవాలు జరుపుకొంటారు. ఉమ్మడి జిల్లాతోపాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని ప్రసిద్ధ ఆలయాలను సైతం సందర్శిస్తుంటారు. మహాశివరాత్రి వేళ అక్కడి ప్రముఖ శైవక్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ప్రకృతి ఒడిలో వెలసిన ఈ ఆలయాలకు స్థానికులు భారీగా తరలివెళ్లనున్నారు.

బెజ్జూర్‌లో అనంత పద్మనాభుడు



శేషపాన్పుపై స్వామివారు

బెజ్జూర్(సిర్పూర్): మహాశివరాత్రికి బెజ్జూర్ మండల కేంద్రంలోని అతిపురాతన రంగ నాయక ఆలయం ముస్తాబైంది. శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. 18వ శతాబ్దంలో కాకతీయ రాజుల నాటి కాలంలో బిజ్జా అనే గోండు రాజు సామంత రాజుగా పాలించేవాడు. బిజ్జా హయాంలోనే బెజ్జూర్‌లో రంగనాయక దేవాలయ నిర్మాణం జరిగినట్లు స్థానికులు చెబుతుంటారు. ఆలయంలో రంగనాయకుడి(అనంత పద్మనాభుడు) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మొదటిరోజు భక్తులు ప్రాణహిత నదిలో స్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకుంటారు. జాగారాలు చేసి, ఉపవాస దీక్షలు చేపడతారు.

కత్తెరసాల మల్లన్న.. ఘన చరిత్ర

- భ్రమరాంభ, మల్లిఖార్జున స్వామి కల్యాణం
- మూడు రోజులపాటు జాతర

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అగస్త్య మహాముని ఇక్కడ శివపార్వతులకు పూజలు చేసే వారని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇక్కడ వెలిసిన మల్లిఖార్జున స్వామి, భ్రమరాంభికల విగ్రహాలకు కాకతీయుల పాలన కాలంలోనే ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయాన్ని 450 ఏళ్ల క్రితం పునర్నిర్మించారు. అగస్త్య మహాముని నారాయణపూర్ గ్రామ సమీపంలోని కోటిలింగాల గోదావరి నదిలో స్నానమాచరించి సొరంగ మార్గం ద్వారా కత్తెరసాల మల్లిఖార్జున స్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించేవారని స్థల పురాణం చెబుతోంది. ప్రతియేటా మహా శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం, నాగవెల్లి జరిపి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఈ గ్రామంలో యాదవులే ఎక్కువ.. వీరు మల్లిఖార్జున స్వామిని ఆరాధ్య దైవంగా భావించి నిత్య పూజలు చేస్తుంటారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన యాదవ కులస్తుడైన కాటవేన గోపాల్ వంశీయులు 450 ఏళ్లుగా ఇక్కడ పూజలు నిర్వహించారు. గోపాల్ తదనంతరం అతని కుమారుడు ఓదేలు, కుమార్తె పోసక్క, మనుమలు ఇక్కడ పూజలు నిర్వహిస్తూ స్వామి వారి సేవలో తరిస్తున్నారు. ఒగ్గు పూజారులు ఒగ్గు కథలు, పట్నాలతో మల్లన్న స్వామికి భోనాలు సమర్పిస్తారు. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం అధికారికంగా నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి, 8నుంచి 10వరకు నిర్వహించే జాతరకు ఏర్పాట్లు చేశారు.



ఆలయ ముఖద్వారం

సోమ్‌నాథ్ ప్రకల్ప్



సోమ్‌నాథ్ శివాలయం

ప్రకృతి ఒడిలో వెలిసిన శివాలయం చంద్రపూర్‌లోని మూల్ పట్టణం సమీపంలోని సోమ్‌నాథ్ వద్ద ఉంది. శివుడి పేరు మీదుగా ఈ ప్రాంతాన్ని సోమనాథ్‌గా పిలుస్తారు. సహ్యాద్రి కనుమలు ఇక్కడి నుంచే ప్రారంభమైనట్లుగా భౌగోళిక గుర్తింపు ఉంది. బాబా ఆమ్టె ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటైన ఆనంద్‌వన్ ఆకర్షణీయంగా ఉంటుంది. శివరాత్రి ఘనంగా నిర్వహిస్తారు. ఆలయం చుట్టూ భారీ వృక్షాలు, పక్కనే జలపాతంతో ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను సైతం ఆకట్టుకుంటుంది. ఇక్కడికి సమీపంలో మూల్ పట్టణం ఉంటుంది. కాగజ్‌నగర్ నుంచి 80కిలోమీటర్ల దూరంలో ఉంది. సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రలోని గోండ్ పిప్రి మీదుగా రోడ్డుమార్గం ద్వారా చేరుకోవచ్చు.

చపరాడ ప్రశాంతధామ్



చపరాడ ప్రశాంతధాం

సంత్‌శ్రీ కార్తీక్ మహరాజ్ ప్రతిష్ఠించిన ప్రశాంతధాం ఆలయాల సముదాయం చపరాడ. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆష్టి సమీపంలోని చపరాడ గ్రామం పేరుతో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ హనుమాన్, శివాలయం, దుర్గాదేవి, శ్రీరాముడు, సాయిబాబా, గజానన్ మహరాజ్ ఆలయాలను కార్తీక్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఏటా శివరాత్రికి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రాణహిత నది జన్మస్థలంలో కొలువైన ఈ ఆధ్యాత్మిక క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తారు. మహారాష్ట్ర, తెలంగాణ సంస్కృతులతో పూజలు నిర్వహిస్తారు. మహారాష్ట్ర ప్రభుత్వం చపరాడకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుంది. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా.. చింతలమానెపల్లి నుంచి అహేరి మీదుగా రోడ్డు మార్గాలు ఉన్నాయి. కాగజ్‌నగర్ నుంచి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది.

తోగుల వెంకటాపూర్



తోగుల వెంకటాపూర్‌లో విగ్రహాలు

ప్రాణహిత నది తీరంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో తోగుల వెంకటాపూర్ ఒకటి. ఇక్కడ చెట్టు కాండంలో దేవతలు వెలిసినట్లుగా భక్తులు భావిస్తారు. సుమారు 800 ఏళ్ల క్రితం స్థానికులకు వేంకటేశ్వర స్వామి కలలోకి వచ్చి చెట్టు కాండంలో ఉన్నట్లు తెలిపాడని.. ఇక్కడి రాజు చెట్టు కాండంలోని దేవుడిని గుర్తించాడని భక్తుల విశ్వాసం. ఇప్పటికీ చెట్టు కాండంలోనే విగ్రహాలను ఉంచి కొలుస్తారు. వేంకటేశ్వర స్వామితోపాటు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొంటారు. భగవంతుడి మహిమలతో వెలిశాయని విశ్వసించే నీటి ఊటలు, వందల ఏళ్ల నాటి అటవీ సంపద భక్తులకు కనువిందు చేస్తాయి. గడ్చిరోలి జిల్లాలోని ఈ ప్రాంతానికి రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. కాగజ్‌నగర్ నుంచి చింతలమానెపల్లి మీదుగా గడ్చిరోలి జిల్లా అహేరికి.. అక్కడి నుంచి నేరుగా తోగుల వెంకటాపూర్‌కు రహదారి సౌకర్యం ఉంది. కాగజ్‌నగర్ నుంచి 110 కి.మీ. దూరంలో ఉంది.

బంగారం బ్యాగు అప్పగించిన కండక్టర్



నగలు అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: బస్సు ఎక్కి దిగే హడావుడిలో బంగారం బ్యాగు పోగొట్టుకున్న ప్రయాణికులకు కండక్టర్ ముత్తన్న తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నాడు. మంగళవారం బెల్లంపల్లికి చెందిన మేకల రమేష్ కుటుంబ సభ్యులతో మంచిర్యాల నుంచి దహెగాంకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ఎక్కారు. ప్రయాణికులు రద్దీగా ఉండడంతో వెంట తీసుకెళ్లిన ఐదు తులాల బంగారం బ్యాగు బస్సులోనే మరిచిపోయి దిగిపోయారు. కొద్దిసేపటి తర్వాత బస్సు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. బెల్లంపల్లికి వెళ్లే సరికి బస్సులో ఓ బ్యాగు కండక్టర్ ముత్తన్న కంటపడింది. దీంతో డ్రైవర్ రాజంతో కలిసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే బస్టాండ్‌లో బ్యాగుకు సంబంధించిన ప్రయాణికులు సంప్రదించడంతో డీఎం రవీంద్రనాథ్ ఆధారాలు చూసి బంగారం బ్యాగు ఇవ్వాలని సూచించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు మేకల రమేష్‌కు అప్పగించారు.

సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్లపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు సంబంధించి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) కేసుల సెటిల్‌మెంట్లపై ఆ శాఖ అధికారులు కంపెనీ అధికారులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏరియా ఇంచార్జి జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజియన్ కమిషనర్ హరి పచౌరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఎంపీఎఫ్ ఎలా సబ్మిట్ చేయాలో వివరించారు. సెటిల్‌మెంట్లు త్వరగా జరగాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓ టు జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) పీ.అరవిందరావు, పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

గని మూసివేతకు పూజలు



హోమం నిర్వహిస్తున్న ఏజెంట్ ఏవీ రెడ్డి దంపతులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5బీ గనిని ఇటీవల మూసివేశారు. ఈ సందర్భంగా బుధవారం శాస్త్రోక్తంగా గనిపై పూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ ఏవీ రెడ్డి దంపతులు, ఎస్‌ఓ టు జీఎం పురుషోత్తంరెడ్డి, మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీలు నర్సింగరావు, నాయకులు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



సీతారాం మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటికి చెందిన బానోత్ సీతారాం(63) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సీతారాం కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన అతడి కుమార్తె కేకలు వేసింది. హుటాహుటిన వచ్చిన కుటుంబ సభ్యులు సీతారాంను ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సీతారాం మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు బానోత్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో గాయపర్చిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: కత్తితో పొడిచి గాయపరిచిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ స్థానిక అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి బుధవారం తీర్పునిచ్చారు. స్థానిక పట్టణ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2023 జూలై 25న సున్నంబట్టి వాడకు చెందిన మార్త సదిరాజు, అదే వాడకు చెందిన మహ్మద్ చాంద్‌పాషా మధ్య గొడవ జరిగింది. చాంద్‌పాష కత్తితో సదిరాజును మెడ, ఎడమ భుజంపై గాయపర్చాడు. సదిరాజు తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్, కోర్టు కానిస్టేబల్ రాజన్న, లైజన్ ఆఫీసర్లు గులామ్ దస్తగిర్, మరియం రాజు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. చాంద్‌పాషాపై నేరం రుజు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

సీఎండీని కలిసిన అధికారుల సంఘం నాయకులు



సీఎండీ ఎన్.బలరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఇటీవల సింగరేణిలో నూతనంగా ఎన్నికైన అధికారుల సంఘం (సీఎంఓఏఐ) నాయకులు కంపెనీ సీఎండీ యన్.బలరాంను మర్యాదగాపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, జనరల్ సెక్రెటరీ పెద్ది నరసింహులు, ఉపాధ్యక్షులు పీ.శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్.కిరణ్‌కుమార్, రాజగోపాల్, కోశాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీట్ అధికారి, వాచర్‌కు ఏడాది జైలు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు అటవీ చెక్‌పోస్టు వద్ద టాటా మాక్స్ ట్రాలీలో వస్తుండగా చెక్‌పోస్టు దండలాగి ఒకరి మృతికి కారణమైన అటవీ బీట్ అధికారి జాడి రాజన్న, వాచర్ కుడుకల రాజేందర్‌లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దస్తురాబాద్ మండలం గొడిసెర్యాలకు చెందిన ద్యాగెటి వినోద్ 2017 ఆగస్టు 20న జగిత్యాల నుంచి టాటా మాక్స్ ట్రాలీలో వినాయకుడి విగ్రహంతో కలమడుగు మీదుగా గొడిసెర్యాలకు వెళ్తున్నాడు. కలమడుగు అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద జన్నారం నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారును ఆపే క్రమంలో తొందరపాటుతో చెక్‌పోస్టు దండ లాగారు. అప్పటికే టాటా మాక్స్ ట్రాలీ చెక్‌పోస్టు దండ సమీపానికి రావడంతో ట్రాలీ వెనుక ఉన్న వినోద్ తల దండకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో మృతుడి తండ్రి ద్యాగెటి లస్మయ్య జన్నారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించిన అనంతరం బీట్ అధికారి జాడి రాజన్న, వాచర్ కుడుకల రాజేందర్‌లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన 16 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. సంజయ్, శ్రావణ్, అనిశ్వర్, సంతోష్, అనిల్‌కుమార్, ప్రదీప్, కార్తీక్, అశ్విన్, కార్తీక్, శ్రీధర్, నవీన్, సాయివర్ధన్, రిషికేష్, మన్విత్ తదితరులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 8 నుంచి 10 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం కృష్ణారావు, కోచ్‌లు అరవింద్, రాకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.